


కథ

అపర్ణాదీక్షిత్

# మనవడి తెలివి

"ఇవాళ వంట ఏం చేస్తున్నా రాంటీ?" వంటింట్లోకి వచ్చి చనువుగా అడుగుతున్న గిరిజను చూసి "వచ్చావా? నీ కోసమే చూస్తున్నా, మోకాళ్ళు పనిచెయ్యటం లేదు. కొద్దిగా విశ్రాంతి తీసుకుంటే గానీ బండి పనిచేయదు. పదకొండు గంట లయింది. మామయ్యగారు షుగర్ పేషెంట్. టిఫెన్ తిన్నా పన్నెండు అయ్యేసరికి భోజనం పెట్టకపోతే నీర సపడిపోతారు"

"మీరిక మాట్లాడకండి గంటలో వంట రెడీ, ఏం చెయ్యాలో చెప్పండి చాలు" అంది గిరిజ.

"వంకాయ అల్లం, పచ్చిమిర్చి వేసి కూర వండి, టమాటా పచ్చడి చేద్దామ నుకుంటున్నాను" అంది ఆయాసప డుతూ వరమ్మ.

పన్నెండుకల్లా డైనింగ్ టేబుల్ మీద భోజనం వడ్డించింది గిరిజ.

"ఈ పిల్లకి మనం బాగా రుణపడిపోతున్నాం వరం, ఇది ఏనాటి అనుబంధమో" అన్నారు తాత గారు.

"పెళ్ళి చేస్తానని చదువు మాన్పించారు మీ నాన్నగారు, సంబంధాలేమైనా చూస్తున్నారా?" కుతూహలంగా అడిగింది వరమ్మ.

"ఇక ఇప్పుడు చూడాలి ఆంటీ, మా తాత గారు నా పేర యాభై వేల రూపాయలు డిపాజిట్ చేశారు నా పెళ్ళి కోసం. అది రేపు వచ్చేస్తుంది. ఆ లక్ష రూపాయలు కట్నంగా ఇచ్చి తను దాచిన డబ్బు పెళ్ళి ఖర్చుకి వాడాలనే నాన్నగారు ఇన్నిరోజులు ఆగేరు" అంది గిరిజ.

"మీ తాతగారు నీ పెళ్ళికోసం డబ్బు డిపాజిట్ చేశారా? మరి ఇన్నాళ్ళూ నాతో చెప్పలేదేం?" ఆశ్చర్యంగా అడిగింది వరమ్మ.

సిగ్గుతో తలవంచుకుని "మరి నేను వస్తా నాంటీ" అంటూ పరుగుతీసింది.

"ఇటువంటి పనిమంతురాలు, అందమైన, తెలివయిన పిల్ల ఏ ఇంట్లో అడుగుపెడితే ఆ ఇల్లు స్వర్గమే" అన్నారు తాతగారు.

"ఆ ఇల్లు మన ఇల్లే ఎందుకు కాకదూడదు?" అన్నది వరమ్మ. ఆశ్చర్యంగా చూసాడు మాధవయ్య. "కట్నం ఇవ్వలేరని, ఇంతకు ముందు మీరడిగినప్పుడు వద్దన్నాను. ఇప్పుడు లక్ష కట్నం ఇస్తారని చెపుతోందిగా, మనవాడు కోరినట్లు తెల్లగా, పొడవైన జడతో అందంగా కూడా వుంది" అంది వరమ్మ ముసి ముసిగా నవ్వుతూ.

"అయితే శంకర్‌కి ఫోన్ చేస్తాను. మీ అమ్మ గిరిజను కోడలిగా సెలక్ట్ చేసుకుందని" అన్నారు తాతగారు సెల్ తీస్తూ.

"కొద్దిగా పొట్టిగా వుందని వంక పెడతాడేమో, మీరే వాడికి సర్దిచెప్పి ఈ పెళ్ళికి ఒప్పించాలి" అంది వరమ్మ మామగారితో.

శంకరం చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయాడు. గవర్నమెంట్ ఉద్యోగి అవడం వల్ల వరమ్మకి పెన్షన్ వస్తోంది. మామగారికి కూడా పెన్షన్ వస్తుంది. ఇద్దరి పెన్షన్‌లతో గుట్టుగా సంసారం లాక్కొస్తోంది.

కొడుకు శంకర్‌కి చదువు పూర్తవగానే హైదరాబాదులో జాబ్ దొరికింది. కూతురు పావని డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది.

శంకర్ అడిగినప్పుడు డబ్బు పంపుతాడు. తను వచ్చినప్పుడు కూడా తాతగారికి, తల్లికి, చెల్లికి విడివిడిగా డబ్బు ఇస్తాడు. తన జీతం ఎంత అనేది ఎప్పుడూ చెప్పడు.

"నేనేమీ డబ్బు పాడు చేసే వాడిని కాదు కదా, జాగ్రత్తగానే దాస్తున్నా. పావని పెళ్ళి నేనే చెయ్యాలి గదా" అంటాడు నవ్వుతూ.

శంకర్‌కి కట్నం తీసుకుని, ఆ డబ్బుతో పావని పెళ్ళి చెయ్యాలని వరమ్మ ఆలోచన. ఇంతలో ఇంటికి తరచుగా వచ్చి కలివిడిగా తిరిగే గిరిజ, శంకర్ మనసులో ప్రవేశించింది. ఎక్కడ కొడుకు గిరిజ వలలో పడతాడోనని శంకర్ ఉన్న రెండు రోజులూ జాగ్రత్తగా కాపలా కాస్తుంది వరమ్మ. తనకు కట్నం తీసుకోకుండా తల్లి పెళ్ళి చెయ్యదు. తన తల్లి అడిగినంత కట్నం గిరిజ తండ్రి ఇవ్వలేదు. అందుకే శంకర్ ఒక ఉపాయం ఆలోచించి గిరిజ తండ్రిని కలిశాడు. "నాకు ఒక్క ఏడాది గడువివ్వండి, గిరిజను నేను మా అమ్మ గారి అంగీకారంతో పెళ్ళి చేసుకుంటాను" అని అభ్యర్థించాడు.


తను ఏం చేయదలచుకుందీ ఆయనతో చెప్పేడు.

తల్లి దగ్గర ఎలా నడుచుకోవాలో, ఎలా మార్కులు కొట్టేయాలో గిరిజకి చెప్పేడు. అప్పటి నుంచి గిరిజ ఆ ఇంట్లో ఒక మెంబర్ అయిపోయింది. వరమ్మకి వంట సాయం చేస్తూ, తాతగారికి కబుర్లు చెపుతూ, పావనికి బాగా దగ్గరైంది.

శంకరం తన అవసరాలకి వాడుకోగా మిగిలిన జీతం బ్యాంక్‌లో వేసి లక్ష పూర్తికాగానే గిరిజ తండ్రికి ఇచ్చాడు. తను గిరిజను ప్రేమిస్తున్న సంగతి తాతగారితో చెప్పేడు.

"మీ అమ్మ చచ్చినా ఒప్పుకోదురా. నీకొచ్చే కట్నంతో పావని పెళ్ళి చెయ్యాలనుకుంటున్నది" అన్నారాయన.

"అందుకు తగిన విధంగా నేను ప్లాన్ వేశాను. ప్రతి నెలా పదివేలు బ్యాంక్‌లో వేసి, ఆ డబ్బు తెచ్చి గిరిజ నాన్నగారికిచ్చాను. నేను కట్నం తీసుకోనని అందరితో చెప్పేనని, కాబట్టి ఆయన



కట్నం ఇచ్చినా ఎవరితో చెప్పవద్దని అమ్మతో చెప్పండి. వాళ్ళ నాన్నగారికి కూడా ఎలా చెప్పాలో చెప్పేను. అంతా నేను అనుకున్నట్లే జరుగుతోంది" అన్నాడు శంకరం.

"ఓరి భడవా, ఎంత గొప్పగా నాటకం ఆడే వురా! అయితే నీ పెళ్ళికి నువ్వే కట్నం ఇచ్చుకున్నావన్నమాట" అన్నారాయన సంతోషంగా.

"మరి, వరమ్మగారిని ఒప్పించటానికి తప్పదుగా" అన్నాడు శంకరం నవ్వుతూ.

గిరిజా, శంకర్‌ల పెళ్ళి వైభవంగా జరిగిపోయింది.

పెళ్ళిలో అందరూ వరమ్మని బాగా పొగిడేరు. "ఈ కాలంలో మీలాంటివారు చాలా అరుదు. ఒక పేదింటి పిల్లకి జీవితాన్ని ఇచ్చారు. మీ అబ్బాయి కూడా చాలా మంచివాడు కట్నం లేకుండా పెళ్ళి చేసుకుని యువతరానికి ఆదర్శంగా నిలిచాడు" అంటూ శంకరాన్ని ఆకాశానికెత్తేశారు.

గిరిజా, శంకర్ హైదరాబాదు వెళ్ళిపోయారు.

"పెళ్ళిలో అందరూ నన్నూ, శంకరాన్ని ఎంతగా పొగిడారో, ఏదో పావనికి పెళ్ళి చెయ్యాలని కట్నం తీసుకున్నాను. వాడు దానికట్నం కోసం దాచిన సొమ్ముని గిరిజ వాళ్ళ నాన్నగారికి ఇచ్చేయమని చెపుదామనిపిస్తోంది" అంది వరమ్మ.

'పిచ్చి తల్లీ, వాడాపని ఎప్పుడో చేశాడు' మనసులోనే అనుకున్నాడు మాధవయ్య. "మరి గిరిజ వాడితో వెళ్ళిపోయింది కదా, మనకిక సాయం ఎవరు చేస్తారు?" అన్నాడు మాధవయ్య దిగులు నటిస్తూ.

"ఈ దబ్బుతో దీని పెళ్ళి చేసేస్తాను. చదువు ఈ ఏటితో పూర్తవుతుందిగా. మనం కూడా హైదరాబాదు వెళ్ళిపోదాం మామయ్యా. గిరిజ మనందర్నీ చాలా బాగా చూసుకుంటుంది" సంబరంగా చెప్పుకుపోతున్న కోడల్ని చూస్తూ "పిచ్చితల్లీ, నీ కోరిక ప్రకారం గిరిజ మనందర్నీ బాగా చూసుకోవాలని మనస్ఫూర్తిగా దేవుడిని ప్రార్థిస్తాను" అనుకున్నారాయన మనసులో.

ఒక పెళ్ళి చెయ్యటానికి వెయ్యి అబద్ధాలు ఆడినా తప్పులేదని సామెత. 'తన పెళ్ళికోసం నా మనవడు ఆడింది ఒకే ఒక అబద్ధం. కట్నం తనిచ్చుకుని మామగారు ఇచ్చినట్లు చెప్పేడు' మనవడి తెలివితేటలకి మురిసిపోతూ, తల్లి మనసు నొప్పించకూడదనే ఆ ఒక్క అబద్ధమైనా ఆడేడు దొంగ భడవా అనుకున్నాడు మాధవయ్య మనసులో.